జ్ఞానేశ్వర్‌కు భారీ మెజార్టీ ఖాయం

మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి


వికారాబాద్ : మద్గుల్ చిట్టంపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 30 : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్‌చిట్టెంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకు నెరవేరని హామీలు ఇచ్చి ఓట్లను దండుకునేందుకు పన్నాగం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారానికి వస్తే గతంలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రజలు నిలదీయాలన్నారు. బీజేపీ కుల మతాలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి రావాలని చూస్తున్నదని ఆరోపించారు. అందరి ఆశాజ్యోతి కాసానిని గెలిపించుకుందామని ఆనంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సంతోష, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, నాయకులు నర్సింహులు, మల్లేశం, కిశోర్, ముర్తుజా అలీ, యూత్ అధ్యక్షుడు గిరీష్ కొఠారీ, కార్యకర్తలున్నారు.

కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి కార్యకర్తలందరూ కృషి చేయాలి

పరిగి : చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం పరిగిలోని తన నివాసంలో పరిగి మండలంలోని బీఆర్ఎస్ బూత్ కమిటీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కాసానిని తప్పనిసరిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీగా బీఆర్ఎస్ నాయకుడు ఉంటే ప్రొటోకాల్ ఉంటుందని.. ఎవరికీ ఏ ఇబ్బంది కలిగినా నేరుగా అధికారులతో మాట్లాడేందుకు మరింత అవకాశం దక్కుతుందన్నారు. కార్యకర్తలందరినీ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని చెప్పారు. పరిగి నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉన్నదని, ఈ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా మరోసారి నిరూపించుకుందామన్నారు. కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకూ ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అయిదు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. బీజేపీ అభ్యర్థి ఎవరినీ నేరుగా కలువరని, ఆయనను కలువాలంటే అపాయింట్‌మెంట్ అవసరమన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి రోజూ రెండు పర్యాయాలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాల్సిందిగా సూచించారు. ఈ నెల 4న పరిగిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు, సమావేశానికి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రాంచందర్‌రావు, ఎంపీపీ అరవింద రావు, మున్సిపల్ చైర్మన్ అశోక్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీలు వెంకట్ రాంరెడ్డి, రవి, నాయకులు పవీణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి, రాజేందర్, యాదయ్య, వెంకటయ్య, జగదీశ్వర్, మాణిక్యం ఉన్నారు.

పరిగి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలి

బషీరాబాద్ : ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే నాయకులను కాకుండా, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజల కనీస అవసరాలు తీర్చే నాయకులను ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం కాశీంపూర్, నవల్గా, మంతట్టి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం స్థాయి వ్యక్తి దేవుళ్లపై ఒట్టు పెట్టే స్థాయికి దిగజారడం చూస్తుంటే ప్రజల్లో సీఎంపై ఎంత నమ్మకం ఉందో అర్థమవుతుందన్నారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై కాకుండా కుటుంబ సభ్యులపై ఒట్టు పెట్టి చెప్పాలని ఆయన సీఎంకు సూచించారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను రుణమాఫీపై రైతులు నిలదీయాలని తెలిపారు. గ్యారెంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. వచ్చే సీజన్ నుంచి రైతు బంధు కూడా నిలిపివేసే ప్రమాదం పొంచి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మరోసారి మోసపోకుండా కారు గుర్తుకు ఓటు వేసి పొరపాటును సరిదిద్దుకునే బంగారు అవకాశం వచ్చిందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే గ్రామాలకు, రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. రెండు దఫాలుగా ఎంపీలుగా ఉన్న వ్యక్తులు తాండూరుకు ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు రాగానే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూటు బూటు మార్చి పంచెకట్టుతో ప్రజలను మోసం చేయడానికి వస్తాడు, ఎన్నికలు కాగానే ఐదేండ్లు మీకు కనిపించడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ మీకు, ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ ఉన్నారు.

బషీరాబాద్ : స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

బీసీలు శాసించాలి.. 'కాసాని'ని గెలిపించాలి

అగ్రకులాలు ఎదగడానికి బీసీల్లో ఉన్న అనైక్యతే కారణం
ఇకనైనా కళ్లు తెరువకపోతే భావితరాలకు
అన్యాయం చేసినట్లవుతుందంటున్న బీసీ నేతలు



బీసీలు అత్యధిక సంఖ్యా బలం కలిగి ఉండి కూడా నేటికీ దేహీ అనే స్థితిలో ఉండడం బాధాకరమని బీసీ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక బీసీలు ఉన్న చోట కూడా అగ్రకులాల వారు గెలుస్తూ వస్తున్నారని, బీసీల అనైక్యతే దీనికి కారణమని వారు చెబుతున్నారు. బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని వారు పిలుపునిస్తున్నారు. ఈ ఎన్నికల్లోనే బీసీ బిడ్డ కాసానిని గెలిపించి బీసీల సత్తాను చూపిద్దామని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ వంటి పార్టీలు ప్రతి ఎన్నికల్లో చెబుతున్న మాయ మాటలను నమ్మి బీసీలు మోసపోతుండడంతో స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా.. రాజ్యాధికారం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని బీసీ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్రవర్ణాల పార్టీలు, నేతలకు తలొగ్గినంత కాలం బీసీలకు న్యాయం జరుగదనే విషయాన్ని గుర్తెరగాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిస్తే.. రానున్న తరాలకు న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే ఇందుకు నాంది పలుకుదామని స్పష్టం చేస్తున్నారు. - రంగారెడ్డి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)

చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటుదాం

చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటుదాం. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ కేటాయించడం సంతోషకరం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలంతా పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి బీసీ నేతను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం. తెలంగాణ గొంతుక వినిపించాలంటే కాసానికి అండగా నిలువాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

– గుత్తి రామస్వామి, తిమ్మారెడ్డిగూడ, షాబాద్

కాసాని గెలుపు ఖాయం

చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపొందడం ఖాయం. ఒక బీసీ నాయకుడికి అవకాశం వచ్చినప్పుడు మనమందరం ఒకసారి ఆలోచించి ఓట్లు మన నాయకుడికి వేసి గెలిపించుకుందాం. రంగారెడ్డిజిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఎన్నో అభివృద్ధి పనులు చేసిన కాసానికి ఈ ప్రాంతంపై మంచి పట్టుంది. అలాంటి నాయకుడు ఎంపీగా గెలిస్తే చేవెళ్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది.

– విఠలయ్య, ప్రజా చైతన్యసమితి షాబాద్ మండల కార్యదర్శి

కుర్మ సంఘం మద్దతు కాసానికే..

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కుర్మ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కుర్మ సంఘం ఆధ్వర్యంలో కాసాని గెలుపు కోసం కృషి చేస్తాం. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే కుల సంఘాలకు న్యాయం జరుగుతుంది. కుల వృత్తులు, చేతి వృత్తులు కుప్పకూలిన సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ వృత్తులకు జీవం పోశారు.

– కర్రి వెంకటేశ్, కుర్మ సంఘం నాయకుడు, బాలాపూర్ మండలం

బీసీలు ఐక్యం కావాలి

చేవెళ్ల ఎంపీ ఎన్నిక సంపన్నులు, సామాన్యులకు మధ్య జరుగుతున్న పోటీ. బీసీలు ఒక్కటి కావలసిన సమయం ఇది. చలి చీమలు ఏకమై సర్పాలను చంపినట్టు సామాన్యులు ఏకమై సంపన్నులను కట్టడి చేయాలి. బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న వారి నోరు మూతపడాలంటే బీసీలు ఐక్యం కావాలి. అహంకారపరులకు గుణపాఠం చెప్పాలి.

– వి మురళీనాయి, బ్రాహ్మణ సంఘం నాయకుడు

బీసీ బిడ్డను గెలిపించుకుందాం

ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు. తక్కువ జనాభా కలిగిన కులాలు రాజ్యాధికారం చేపడుతున్నాయి. బీసీల్లో నాయకులు రాజకీయాల్లో ఎదగలేకపోతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వకుండా బీసీలను అవమానపరుస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ బీసీ బిడ్డ జ్ఞానేశ్వర్‌కు ఎంపీ అవకాశం కల్పించడం చాలా సంతోషం.

– రాఘవేంద్ర, కురుమ సంఘం యూత్ ఉపాధ్యక్షుడు, వికారాబాద్ జిల్లా

ఓటు బ్యాంకుగా వాడుకునే వారికి బుద్ధి చెప్పాలి

బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకొని బీసీల ఐక్యతను ఢిల్లీలో చాటిచెప్పాలి. మన ఐక్యతను కోల్పోతే ఎదుటివారి ముందు చులకన అవుతాం. ఈసారి కచ్చితంగా కాసానిని రాజకీయాలకు అతీతంగా గెలిపించుకోవాలి. లేదంటే అగ్రవర్గాల నేతల విమర్శలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎల్లప్పుడూ ఉంటాయి.

– గోవింద్‌రాజ్‌గౌడ్, ధారూరు

కాసాని జ్ఞానేశ్వర్‌కు ఒక అవకాశం ఇవ్వాలి

బీసీ నాయకుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌కు ఒక అవకాశం ఇవ్వాలి. బీసీలను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి బీసీల ఐక్యతను చాటిచెప్పాలి. ఇందుకు ఇంతకు మించిన మంచి సమయం ఉండదు. బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకోవాలి. బీసీల ఐక్యతను చాటిచెప్పి బీసీ కులాల గొంతును ఎలుగెత్తి చాటాలి.

– సతీష్ ముదిరాజ్, రాయదుర్గం ముదిరాజ్ సంఘం నాయకుడు

బీసీల ఐక్యతను చాటిచెప్పాలి

సామాజిక చైతన్యం దిశగా మనందరం అడుగులు వేయాలి. చాలాకాలంగా బీసీ కులాల అభివృద్ధికి పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్ లాంటి నాయకులకు ఓటేసి సామాజికంగా బీసీల ఐక్యతను చాటిచెప్పాలి. పార్లమెంట్‌లో బీసీల పక్షాన నిలబడి మనందరి సమస్యలపై పోరాడేందుకు ఇలాంటి బీసీ నాయకుడు ఎంతో అవసరం. బీసీలందరూ కారు గుర్తుకు ఓటువేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి.

– మునీశ్వర్‌గౌడ్, కొండాపూర్

రాజకీయాలకతీతంగా కాసానికి ఓటెయ్యాలి

రాజకీయాలకతీతంగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరు కూడా బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసేలా ప్రచారం చేస్తాం. బీసీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఓటర్లలో చైతన్యం తెస్తాం. పార్టీలకతీతంగా ప్రతి ఓటరు ఆలోచించి బీసీ అభ్యర్థి కాసానికి ఓటు వేసి గెలిపించాలి.

– బుద్దోలు బాలమణి, మణికొండ

కాసాని గెలుపునకు మహిళలను ఏకం చేస్తాం

చేవెళ్ల ఎంపీ బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ లభించడం హర్షణీయం. మహిళలందరిని ఏకం చేసి బీసీ నాయకుడి గెలుపు కోసం కృషి చేస్తాం. మొదటిసారిగా బీసీ అభ్యర్థి బరిలో ఉండటం బీసీల అదృష్టంగా భావించి ఓటు వేయాలి. కాసాని గెలుపుతో బీసీల ఐక్యత పెరుగుతుంది. రంగారెడ్డి జిల్లాపై ఆయనకు ఎంతో అవగాహన ఉన్నది.

– శైలజ, మణికొండ

బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

బీఆర్ఎస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు ఖాయం. ప్రస్తుతం ఇతర పార్టీల్లో ఎంపీగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో కేసీఆర్ ఇచ్చిన బీ ఫారంల ద్వారా గెలిచి పదవులు అనుభవించారు. కాసాని ఉమ్మడి రాష్ట్రంలోనే మంచి పేరున్న బీసీ వర్గానికి చెందిన నాయకుడు.

– పాండుముదిరాజ్, చింతల్‌పల్లి, పూడూరు మండలం

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం. 96 కులాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పేదల సంక్షేమమే ధ్యేయంగా కాసాని పని చేశారు. బీసీ నేతకు వచ్చిన అవకాశాన్ని బడుగు, బలహీనవర్గాల నాయకులు సద్వినియోగం చేసుకుంటారు. ప్రజా సేవయే పరమార్థంగా భావించిన కాసానికి భారీ మెజార్టీ రావడం ఖాయం.

– శకుంతల దేశ్‌పాండే, గౌతాపూర్, తాండూరు

బీసీల ఐక్యతను చాటుతాం

ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటుతాం. బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించి మా సత్తా చాటుతాం. వచ్చిన అవకాశాన్ని బడుగులు వదులుకోరు. ప్రజ సేవ కోసం అహర్నిశలు కృషి చేసే, మహా నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్. పార్టీతోపాటు నియోజకర్గంలోని ముదిరాజ్ బిడ్డలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.

– లక్ష్మణ్ ముదిరాజ్, కరణ్‌కోట, తాండూరు

బీసీల ఐక్యతకు కృషి చేసిన నాయకుడు జ్ఞానేశ్వర్

ఉమ్మడి రాష్ట్రంలోనే బీసీలను ఐక్యత చేసిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. ప్రస్తుతం ఇతర పార్టీలు రెడ్డి సామాజిక వర్గాలకు టికెట్లు ఇవ్వగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం మా బీసీ వర్గానికి చెందిన నాయకుడికి టికెట్ ఇచ్చారు. దీంతో ఈ ఎన్నికల్లో బీసీలందరం ఏకమై రెడ్డి సామాజిక వర్గాన్ని ఓడించి జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇచ్చి మా ఐక్యతను చాటుతాం.

– అజహరుద్దీన్, చన్గోముల్ పూడూరు మండలం

గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత బీఆర్ఎస్‌దే..

- రేపు జరుగనున్న గిరిజన గర్జన సభను విజయవంతం చేయండి
- 10 వేల మందితో సభ
- ముఖ్య అతిథులుగా మాజీ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి
- ఆమనగల్లులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పక్కన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి.

ఆమనగల్లు, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న నాయకుల గత చరిత్ర తెలుసుకుని ఓటు వేయాలన్నారు. మన ప్రాంత వాసి, మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ఉన్నత విద్యావంతుడని, గురుకుల కార్యదర్శిగా పని చేసి దాదాపు 10 లక్షల మంది బడుగు బలహీన వర్గాల బిడ్డలను ఉన్నత స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని కొనియాడారు. ఐపీఎస్ ఆఫీసర్‌గా పోలీస్ వ్యవస్థలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి ఆర్ఎస్‌పీది అని పేర్కొన్నారు. 7 సంవత్సరాల పదవి ఉన్నా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని వదిలి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే ఆగమైన తెలంగాణను మళ్లీ పునర్నిర్మాణం గావించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆర్ఎస్పీ ఎంపీగా గెలిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు రావాల్సిన నిధులు కొట్లాడి తెస్తాడని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల సీన్ మొత్తం మారిపోయిందని కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టాక బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలువదని చెప్పిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలాంటి నాయకులు నోరు మెదపడం లేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి కీలకమన్నారు. ఈ ఎన్నికల్లో 12 ఎంపీ స్థానాలు గెలిస్తే కేంద్రంలో కేసీఆర్ చక్రం తిప్పడం ఖాయమన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ గ్రాఫ్ పడిపోతున్నదని.. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో ప్రజాదరణ పెరుగుతున్నదని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయ మాటలను నమ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు రాష్ట్ర ప్రజలు గోసపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ 12 ఎంపీ స్థానాలు గెలుస్తుందని సర్వే రిపోర్ట్స్ చెబుతున్నాయన్నారు. గెలిచే స్థానంలో మొదటిది నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానమేనన్నారు. ఆర్ఎస్పీని ఓడగొట్టడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తరం కాదన్నారు. గిరిజనులను ఓట్లు అడిగే హక్కు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. గిరిజనుల చిరకాల వాంఛ అయిన తండాలను గ్రామపంచాయతీలుగా చేసి, రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం 1001 గురుకులాల పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి రూ.1.50 లక్షలు కేటాయించి వారికి అన్ని వసతులు బీఆర్ఎస్ పార్టీ కల్పించిందన్నారు. అన్ని మండల కేంద్రాల్లో గిరిజన భవన్‌లు కట్టించామన్నారు. నూతనంగా ఏర్పాటైన గిరిజన తండాలకు రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాలు కట్టించిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూ.12500 కోట్లు కేటాయించి నియోజకవర్గంలోని తండాలకు బీటీ రోడ్లు, లింక్‌రోడ్లు నిర్మించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులన్నీ నిలిపివేసిందన్నారు. ఓట్లు అడగడానికి తండాల్లోకి వస్తే బీజేపీ, కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్థానికుడు, ఉన్నత విద్యావంతుడని, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి స్థానికేతరుడని.. ఆయన రెండు సార్లు ఎంపీగా చేసినా అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. మే 2న పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ గిరిజన గర్జన సభ నిర్వహిస్తున్నామని.. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిరిజన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు ఆయన తెలిపారు. తదనంతరం పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గిరిజన అడ్‌హక్ కమిటీని ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దశరథ్ నాయక్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అర్జున్‌రావు, పత్యానాయక్, కౌన్సిలర్ రాధమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖలీల్, శ్రీను, వెంకటయ్య, దశరథ్‌నాయక్, సుభాష్, సాయిలు, శ్రీనూనాయక్, పంతూ నాయక్, రమేశ్‌నాయక్, పరమేశ్, ప్రసాద్, సతీష్, రవికుమార్, రంజిత్, అంజి, మహేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ లొకేషన్లకు ఇన్‌చార్జి అధికారుల నియామకం

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతి పోలింగ్ స్టేషన్ లోకేషన్‌కు ఇన్‌చార్జి అధికారులను నియమించామని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. బీఎల్‌వోలతో ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణి జరిగేలా చూడాలని, ఎన్నికల ముందు రోజు పోలింగ్ సిబ్బందికి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహణ, స్లిప్స్ అన్ని సరి చూసుకొని డిలీట్ చేయడం, పోలింగ్ రోజు నిర్వహించే విధుల పట్ల, ఈవీఎం యంత్రాల పని తీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి సారించి పిచ్చి మొక్కలు తొలగించడం, మురికి కాలువలను శుభ్రం చేయించడం, ప్రతి నర్సరీలో మొక్కలకు నీరు పెట్టడం, మొక్కలు బాగా పెరిగేటట్లు చూడాలన్నారు. ఎండాకాలం మొక్కలు ఎండిపోకుండా గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీరు పెట్టేలా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు 100 శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవకాశమున్న ప్రతి గ్రామంలో లేబర్ సమీకరణ జరగాలని, ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలు పని చేసే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కూలీలు ఉదయమే పనిలోకి వచ్చి మధ్యాహ్నం వరకు ఇంటికి చేరుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మండలాలవారీగా ఏ మండలంలో ఎంత మంది లేబర్ సమీకరణ జరిగిందో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీపీవో జయసుధ, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు ఉన్నారు.

స్మారక నాణేన్ని విడుదల చేస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, రెవ. దాజీ

బాబూజీ మహరాజ్ సందేశం.. ఆశ, భరోసా

- మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- బాబూజీ మహరాజ్ 125 జయంతి సందర్భంగా స్మారక నాణెం విడుదల

కొత్తూరు, ఏప్రిల్ 30 : బాబూజీ మహరాజ్ సందేశం మనిషిలో ఆశ, భరోసాను కలిగిస్తుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. బాబూజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు రెండో రోజు మంగళవారం చేగూరులోని కన్హా శాంతి వనంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాబూజీ మహరాజ్ స్మారక వెండి నాణేన్ని గైడ్ ఆఫ్ హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామ చంద్రమిషన్ అధ్యక్షుడు రెవ. దాజీతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక నాయకుడిగా బాబూజీ మహరాజ్ వారసత్వాన్ని గౌరవించడానికి కన్హాకు వచ్చామని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న దాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి కన్హా శాంతివనాన్ని సందర్శించడం వల్ల అభ్యాసకులందరూ ప్రయోజనం పొందేలా భండారాలను చక్కగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.

మానసిక, శారీరక ఎదుగుదలపై శ్రద్ధ వహించాలి

వికారాబాద్ జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీపద్మ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతీపద్మ

వికారాబాద్, ఏప్రిల్ 30 : పిల్లలకు ఆరోగ్యం, పరిశుభ్రత, కుటుంబంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదలపై శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీపద్మ తెలిపారు. మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో బాలల సంరక్షణ గృహాల్లోని పిల్లల స్థితిగతులపై బాలల సంరక్షణ గృహాల నిర్వాహకులతో కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి చాంబర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు ప్రేమానురాగాలు చాలా అవసరమని, పిల్లలను ఇంటికి పంపిన తర్వాత వారి క్షేమ సమాచారాలు తెలుసుకోవాలన్నారు. సంరక్షణ గృహాల్లో ఉన్నప్పుడు వారి వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, అభిరుచి, వ్యక్తిగత అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, సంరక్షణ గృహాల్లో పిల్లల ఆహార పట్టిక తప్పక ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలు ఆటపాటలపై శ్రద్ధ వహించేలా ప్రోత్సహించాలని సూచించారు. సంరక్షణ గృహాలకు సంబంధించి సమస్యలేమైనా ఉంటే జిల్లాలోని బాల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని బాలల సంరక్షణ గృహాల్లో మంచి పనితీరు, కనీస వసతుల కల్పన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య పరిశుభ్రతతో పాటు వేసవి కాలంలో పిల్లలకు ఆటపాటలకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. ఇంటికి పంపే పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. సమావేశానికి హాజరైన హోం నిర్వాహకులు, మేనేజర్లు వారి కేంద్రాల పని తీరు, పిల్లల ఆరోగ్యం, విద్య తదితర అంశాలను వివరించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు ప్రకాశ్, సంగమేశ్వర్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.